జిల్లా అభివృద్ధికి సంబంధించిన విషయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, పక్కన జిల్లా ఎస్‌పి మాధవరెడ్డి

గిరిజన విద్య అధ్వానం

శిథిలమైన రేకు షెడ్‌ల్లో తరగతులు
ఉపాధ్యాయుల్లేక చదువుకు దూరమవుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - సీతంపేట

ఈ పాఠశాల మండలంలోని ధారపాడు పంచాయతీ రామనగరం మండల ప్రాథమిక పాఠశాల. గట్టిగా గాలివేస్తే ఎగిరిపోయి రేకుల షెడ్డు.... చినుకుపడితే తరగతి గది అంతా వరదే... గిరిజన విద్యకు పెద్దపీట వేస్తున్నామని... ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నామని చెబుతున్న పాలకులకు, అధికారులకు ఈ పాఠశాలను చూస్తే సర్కారు బడులు దుస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్ధమవుతాది.

మండలంలోని ధారపాడు పంచాయతీ రామనగరంలోని మండల ప్రాథమిక పాఠశాల పాడుపడిన రేకుల షెడ్‌లో గిరిజన చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారు. గట్టిగా గాలివేస్తే రేకులు ఎవరి మీదపడతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే చిన్న చినుకుపడ్డా వరద నీరంతా తరతగతి గదిలోనే ఉండిపోవడంతో విద్యార్థులకు ఆరోజు సెలవే. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువు తున్నారు. రెండో విడత నాడు నేడు పనులు చేయపట్టకపోవడంతో ఈ పాఠశాల పరిస్థితి

రేకు షెడ్‌లో శిథిలమై ఉన్న రామనగరం ప్రాథమిక పాఠశాల

అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే జోక్యం చేసుకొని పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె.శ్రీరాములు, బి. పరసరాం, ఏ. చిరంజీవి డిమాండ్ చేశారు. నెల రోజుల్లో పనులు చేపట్టకపోతే ఎంఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గురువు ల్లేక తెరుచుకోని జిపిఎస్ లు

సాలూరు : మండలంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయుల్లేక తెరుచుకోలేదు. ఐటిడిఎ అధికారులు ఈ పాఠశాలలకు ఉపాధ్యాయులను సకాలంలో నియమించకపోవడంతో అవి మూతపడి వున్నాయి. ఫలితంగా గిరిజన పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. మండలంలోని నాలుగు జిపిఎస్‌లకు ఉపాధ్యాయుల్లేక మూతపడి వున్నాయి. నిమ్మలపాడు, బందపాయి, రామస్వామివలస, పనసలవలస గిరిజన గ్రామాల్లో జిపిఎస్‌లు మూతపడివున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు జూన్ 12న ప్రారంభమైనా ఇంతవరకు గిరిజన ప్రాథమిక పాఠశాలలు తెరుచుకోలేదు. గిరిజన విద్య పట్ల ఐటిడిఎ అధికారులు ఎంత శ్రద్ధ వహిస్తున్నారనేది జిపిఎస్‌ల తీరు చూస్తే అర్ధమవుతుంది.

సాలూరు : ఉపాధ్యాయుడు లేక మూతపడిన పాఠశాల; బయట ఆడుకుంటున్న చిన్నారులు

సిఎం సభా వేదిక ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం /కురుపాం

ఈనెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభాస్థలి వేదిక ఏర్పాట్ల కోసం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో నాలుగు చోట్ల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలించారు. ముందుగా మండ, గుమ్మలక్ష్మీపురం హెచ్ గ్రౌండ్, ఎస్.కెపాడు నర్సరీ ప్రాంతాల్లో ఉన్న సభా వేదిక స్థలాలను పరిశీలించారు. అనంతరం కురుపాం మండలం రస్తాకుంటు బాయి సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈ నాలుగింటిలో ఏదో ఒకచోట ముఖ్యమంత్రి సభ ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆదివాసీ ఉత్సవాల్లో 500 మంది గిరిజనులతో సిఎం మమేకం అవుతారని సమాచారం. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శోభిక, పాలకొండ ఆర్‌డిఒ వివి రమణ, డిఎస్‌పి కృష్ణారావు, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

మండ పాఠశాలను అభినందించిన కలెక్టర్

ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకోడానికి వీలుగా మండ పాఠశాలను ఉపాధ్యాయులు తీర్చిదిద్దడం అభినందనీయమని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ పర్యటనలో భాగంగా మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు పెంచిన కూరగాయల పంటలను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది విద్యార్థులను బోధించిన నాడే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం హెచ్‌మైదానంలో సిఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే జగదీశ్వరి

నేడు అంతర్జాతీయ తల్లి పాల దినోత్సవం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంతర్జాతీయ తల్లి పాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిషేధ చట్టం, పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణా నిరోధక చట్టం, గృహహింస నుండి మహిళల రక్షణ తదితర అంశాలపై అవగాహన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ ప్రకటన కోరారు.

ఎపిఎంతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి

చిరుద్యోగుల జోలికి పోతే

వైసిపికి పట్టిన గతే టిడిపికి

సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి హెచ్చరిక

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో గత కొన్నేళ్లుగా వెలుగులో పని చేస్తున్న విఒఎలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఆశా వర్కర్లు ఇలా అనేక మంది చిరు ఉద్యోగులను తెలుగుదేశం నాయకులు ఇష్టానుసారంగా తొలగింపులకు పాల్పడుతున్నారని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన సిపిఎం నాయకులు కొల్లి గంగునాయుడు, కె.సీతారాం, జి.శ్రీనివాసరావుతో కలిసి ఎపిఎం నాగభూషణరావుతో మాట్లాడారు. చినమేరంగి, అల్లువాడ, శిఖబడి, గౌరంపేట, డంగభద్ర, పెదబుడ్డిడి, చింతలబెలగాం, గెడ్డతిరువాడ గ్రామాలకు చెందిన విఒఎలను తొలగిస్తూ ప్రజాప్రతినిధులు ఎపిఎంకు ఆదేశాలివ్వడం సరికాదన్నారు. అలాగే జోగులడుమ్మ ఫీల్డ్ అసిస్టెంట్, కుదమ, తురకనాయుడు వలస గ్రీన్ అంబాసిడర్లను తొలగించడం వల్ల మీకు, మీ పార్టీకి ఒరిగేదేమీ లేదన్నారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడితే ప్రజాదరణతో గెలుపొందిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో ఇదే పని వైసిపి నాయకులు చేయడంతో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని అదే పరిస్థితిని ప్రస్తుత టిడిపి నాయకులు పునరావృతం చేయడం దుర్మార్గపు చర్యకాదానినని ప్రశ్నించారు. అంతేకాకుండా మరో 9మంది విఒఎలను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఒక వేళ వారు తప్పుచేస్తే తొలగించాలి కానీ పార్టీపరంగా వ్యక్తి గత కక్షలతో చిరుద్యోగులను తొలగించడం మంచి పద్ధతి కాదని అన్నారు. కేవలం విఒఎలు మగవారినే తొలగించాలని ప్రభుత్వ ఆదేశాలుంటే ఇన్నేళ్ల పాటు వారిని ఎలా కొనసాగించారని ప్రశ్నించారు. ఇంత మంది మహిళలు మధ్య మగ విఒఎలు ఉండకూడదని జిఒ ఉంటే వారితో పాటు సిసిలు, ఎపిఎంలను కూడా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ఎవరినైతే విధుల నుంచి తొలగించారో వారందర్నీ తిరిగి వారం రోజుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు తెలిపి తదుపరి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఇకపై ఇలాంటి కక్షపూరిత చర్యలను మండల స్థాయిలో నాయకులు చేస్తున్నప్పుడు సిపిఎం చూస్తూ ఊరుకోదని తెలిపారు. కార్యక్రమంలో బాధిత విఒఎలు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించడం ద్వారా వ్యాధులు తీవ్రత కాకుండా అరికట్టవచ్చని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహన్ రావు స్పష్టం చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో లీగల్ సర్వీస్ కమిటీ సూచనల మేరకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన మందులు, వైద్య పరికరాలు, ఆరోగ్య తనిఖీల వివరాలు పరిశీలించారు. సీజనల్ జ్వరాలు, వ్యాధులతో ఎంత మంది నమోదు అయ్యారని వివరాలు తనిఖీ చేశారు. వారికి నిర్వహించిన రక్త పరీక్షలు, అందజేసిన చికిత్సపై వైద్యాధికారిని అడిగారు. విద్యార్థులు, స్థానిక ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే తెలియజేయాలని, అదేవిధంగా వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో తరచుగా పర్యవేక్షిస్తూ సీజనల్ వ్యాధులను సకాలంలో గుర్తించి సత్వరమే వైద్య పరీక్షలు చేపట్టి, మందులు అందజేయడం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అరికట్టవచ్చని అన్నారు. ప్రజలు కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా ఐరన్ మాత్రలు షెడ్యూల్ ప్రకారం వేయించాలని, విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ పూర్తి చేయాలని అన్నారు. కెఆర్బిపురం పిహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో పాల్గొని క్షేత్ర స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మల్లిఖార్జునరావు, వైద్యాధికారులు డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శామ్యూల్, ఎంఇఒ జి. చిన్నతిరుపతిరావు, ప్రిన్సిపల్ జ్యోతి, పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఐటిడిఎ పిఒ సేధుమాదవన్

ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఐటిడిఎ గిరిమిత్ర సమావేశమందిరంలో పిఒ ఎస్.సేధు మాధవన్ పర్యవేక్షణలో అధికారులు కౌన్సిలింగు నిర్వహించారు. కౌన్సిలింగ్‌లో ఏర్పడిన ఖాళీల్లో ఉపాధ్యాయులు ఎంచుకున్న ఐచ్ఛికాల ప్రకారం బదిలీలు చేపట్టారు. మొత్తం 76 మంది ఉపాధ్యాయులు కౌన్సిలింగుకు హాజరయ్యారు. బదిలీ అయిన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని, పారదర్శకంగా ఉపాధ్యాయులు కోరిన స్థానాలకు బదిలీ చేశామని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడి పనిచేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పిఒ సూచించారు. కౌన్సిలింగులో ట్రైబల్ వెల్ఫేర్ డిడి రుక్మాంగధయ్య, ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ సుగుణ, పిఎంఆర్‌సి ఎఎంఒ రాయుడు, సహాయ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నందివానివలస సమీపాన ఏనుగులు సంచారం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని నందివానివలస సమీపాన ఏనుగులు మంగళవారం సంచరించాయి. కొమరాడ, జియ్యమ్మ వలస, మండలాల్లో సంచరించిన ఏనుగులు నందివానివలస సమీపంలోకి ప్రవేశించిన వరి నారుమళ్లు, ఇటీవల చేపట్టిన వరినాట్లుతో, కాయగూరల పంటలను ధ్వంసం చేయడంతో తీవ్ర నష్టాలకు గురయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏనుగుల గుంపు సంచరిస్తుండడంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాలకు గురైన రైతులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఈప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు .

ఆర్‌టిసి డిపో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు
కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు, మెకానిక్ ,లు, హెల్పర్స్ కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయాల్లో కార్మికులతో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోలో 13 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులుగా సుమారు 25 మంది పని చేస్తున్నారని, వీరిలో స్కిల్డ్‌గా పనిచేస్తున్న వారికి లేబర్ డిపార్ట్మెంట్ నిబంధన మేరకు కాంట్రాక్టర్ రూ.15700లు, అన్‌స్కిల్డ్ వారికి రూ.10200 నెలకు చెల్లించాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ, అన్ని సౌకర్యాలు అమలు కోసం ఆర్‌టిసి ప్రతి కార్మికుడికి సుమారు. రూ.20వేలు దాటి కాంట్రాక్టర్‌కు చెల్లిస్తుండగా, కార్మికులకు తక్కువ మొత్తాన్ని వేతనాల రూపంలో అందిస్తున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ మాత్రం స్కిల్డ్ కార్మికులకు రూ.14వేలు, అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.10వేలు చెల్లిస్తానని తెలియజేస్తూ నచ్చితే చేయండి లేకపోతే పొండని బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. దీన్ని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్, సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి భాస్కరరావు, బి.త్రినాధరావు, కృష్ణకాంత్, రాంబాబు, కుమారస్వామి, వి.శ్రీనివాసరావు, సిహెచ్ వెంకట్రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖకమిషనర్ కార్యాలయంలో వినతిని అందజేస్తున్న కార్మికులు

గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతకు వారికి ఆసక్తి ఉన్న కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్టు ఐటిడిఎ పిఒ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల నుంచి సమాచారం సేకరించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా క్యూఆర్ కోడ్ రూపొందించడం జరిగిందని, క్యూఆర్ కోడ్ ఓపెన్ చేయగానే వచ్చే లింకును క్లిక్ చేస్తే గుగూల్ దరఖాస్తు ఓపెన్ అవుతుందని, అందులో మీ సమాచారాన్ని పూర్తిగా నింపి, మీకు నచ్చిన కోర్సును ఎన్నుకొని ఆ దరఖాస్తును సబ్మిట్ చేయాలని సూచించారు. ఈ డేటా ఆధారంగా ఎక్కువ మంది యువతచే ఎన్నుకోబడిన కోర్సుపై శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని పిఒ తెలిపారు. సీతంపేట, ఐటిడిఎ వెబ్ సైట్ ITDASEETHAMPETA.AP.GOV.INలో కూడా ఈ లింక్ ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. పూర్తి వివరాలకు సీతంపేట వైటిసి మేనేజర్ బి.వెంకటరమణ (7032060773)లి ను సంప్రదించాలని సూచించారు. కింద ఇచ్చిన లింక్ ద్వారా యువత తమ డేటాను సమర్పించాలని పీవో అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, పనికి సమాన వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర కోరారు. మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పేదలకు 24 గంటల పాటు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ఆశావర్కర్లు విధులు నిర్వహిస్తున్న కనీసం గుర్తింపులేదన్నారు. ఆశా వర్కర్లపైనే తమ కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నయని అన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్చాలన్నారు. ఆశాల నియామకాలు ప్రభుత్వమే నేరుగా చేపట్టాలని, రాజకీయ జోక్యం తొలగించాలని అన్నారు. ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్స్, వేతనంతో కూడిన వెటర్నరీ లీవ్ అమలు చేయాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు, శిక్షణ ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 62 సంవత్సరాలకు రిటైర్మెంట్ జిఒ వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ అయిన, మరణించిన కుటుంబాలు అర్హులైన వారిని ఆశాలుగా నియమించాలని, కోవిడ్ సమయంలో మరణించిన ఆశాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీ, స్టాఫ్ నర్స్ నియామకాల్లో ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండంగి సన్యాసిరావు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజలను చైతన్యపర్చే పార్టీగా సిపిఐ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్ అన్నారు. మంగళవారంవారం స్థానిక గిరిజన భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విల్సన్ మాట్లాడుతూ కార్యకర్తలంతా నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజలకు పార్టీ గురించి చెప్పాలని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేంద్రంలో బిజెపి వ్యవహరిస్తున్న తీరు ప్రజలందరికీ కార్యకర్తలంతా తెలపాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. నవంబర్ 28,29,30 ఎఐఎస్ఎఫ్ మహాసభలు జరుగనున్నాయని, దీన్ని అన్ని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, పార్టీ శాఖల నాయకులు హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు, సహాయ కార్యదర్శి టి.జీవ, ఎఐటియుసి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొచ్చ మోహనరావు, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ జనార్ధన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవి నాయుడు, బుడితి అప్పలనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, కె.గోపీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నిండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పేదరికంలో ఉన్న మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా ఆర్థికంగా జీవిస్తూ వారి కుటుంబానికి తోడుగా ఉండాలనే ఉద్దేశ్యంతో 2000లోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగు సంస్థను ఏర్పాటు చేశారని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో 18 ఏళ్లు నిండిన మహిళలను ఆర్థికంగా ఆదుకోవడమే వెలుగు ముఖ్యలక్ష్యమన్నారు. చిన్న, పెద్ద సంఘాలన్న తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండి ప్రభుత్వం అందించే సిఐఎఫ్, బ్యాంకు లింకేజ్, ఉన్నతి, శ్రీనిధి ఇలా ఎన్నో రుణాలను బ్యాంకుల్లో నుంచి పొందవచ్చన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని, రుణా సదుపాయాన్ని పొంది మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. తొలుత వెలుగు కార్యాలయం ముందు మొక్క నాటారు. అనంతరం ఎపిఎం ఆదయ్య మాట్లాడుతూ మండలంలో 27 పంచాయతీల్లో 207 గ్రామాల్లో 31 గ్రామ సంఘాలున్నాయని తెలిపారు. 1030 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, టిడిపి నాయకులు తాడంగి లక్ష్మణరావు, వెంపటాపు భారతి, తదితరులు ఉన్నారు.

మొక్కకు నీరుపోస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - మక్కువ

ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు స్థానిక నాలుగో అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ లీలావతి మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లి పాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. అలాగే బిడ్డకు 6 నెలలు పూర్తయ్యే వరకు కేవలం తల్లి పాలు మాత్రమే తాగించాలని, ఇతర ఎలాంటి పానీయాలు పెట్టకూడదని సూచించారు. తల్లి పాలు ఆవశ్యకతను తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మక్కువ సూపర్వైజర్ పి.రాజశ్రీ, మహిళా పోలీస్ లావణ్య, మక్కువ 1, 2 అంగన్వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వీరఘట్టం : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని స్థానిక సిడిపిఒ బి.సిమ్మాలమ్మ గర్భిణులకు, బాలింతలకు సూచించారు. వీరఘట్టంలోని కూరాకుల వీధిలో ఏర్పాటు చేసిన తల్లిపాలు వారోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టవచ్చునని తల్లులకు సూచించారు. ఎక్కువగా ఆకుకూరలు తింటే ఆరోగ్యంగా ఉండడంతో పాటు లోపల పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని తల్లులకు వివరించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్.రాజేశ్వరి, మహిళా పోలీస్ విజయలక్ష్మితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గర్భిణీలు, బాలింతలు, పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కుసిని పెదరామ సెక్టార్ ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో తల్లిపాలు వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, సిడిపిఒ పి.రంగలక్ష్మి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లి పాలు వారోత్సవాలు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి రవీంద్ర చాందిని, సూపర్వైజర్లు లావణ్య, గౌరీ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భామిని : నవజాత శిశువుకు తల్లి అందించే పాలు, వ్యాధి నిరోధక శక్తితో పాటు, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తుందని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం అన్నారు. మండలంలోని మనుమకొండ, బిల్లుమడలో ఐసిడిఎస్ పిఒ శాంతి, భవాని ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవాలును నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు తల్లి పాల ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టంలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సిమ్మాలమ్మ

కొమరాడ : పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలుతోనే ఆరోగ్యం సాధ్యమని ఎండబద్ర సెక్టర్ యూనియన్ నాయకులు కె.మల్లేశ్వరి అన్నారు. మండలంలోని ఎండభద్ర సెక్టార్ పరిధిలో గల కోనేరులో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ బాలింతలకు అందిస్తున్న పౌష్టిక ఆహారం వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శారదాంబ, సెక్టార్ యూనియన్ నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు లలిత, రవణమ్మ శిరీష, చిట్టెమ్మ, తరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లిలో తల్లి పాల ఆవశ్యకతను అంగన్వాడీ సిబ్బంది, ఆశా, వైద్య సిబ్బందితో ప్రచారం నిర్వహించారు. మామిడిపల్లి వైద్యులు శివకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

8న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

మండలంలోని డోకిశీలలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం, క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ జిల్లా యూనియన్ అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీకాకుళం జిల్లా రాగోలు వద్ద ఉన్న జేమ్స్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరవుతారన్నారు. ఈ వైద్య శిబిరంలో గుండె, స్త్రీ సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు, కన్ను తదితర అన్ని రకాల సాధారణ వ్యాధులకు అనుభవజ్ఞులైన వైద్యులచే తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిజేస్తామన్నారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. కావున సమీప ప్రజలంతా ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నడిమింటి గోపాలనాయుడు, ఉపాధ్యక్షులు వానపల్లి శంకరరావు, జాయింట్ సెక్రటరీ బివి రమణ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

చదువుకునే వయసులో విద్యార్థులు సారాయి, పొగాకు వంటి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రముఖ న్యాయవాది బరాటం చంద్రమౌళి సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నోటొబాకో ఫ్రీ డ్రగ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ప్రయోగాలు వంటి కార్యక్రమాల్లో నిత్యం పాల్గొంటే చెడు అలవాట్లకు దూరమవుతారని అన్నారు. ఏ వ్యాపకం లేకపోతే చెడు అలవాట్లు మనసులో దూరి జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. కావున ప్రతి విద్యార్థి పొగాకు, డ్రగ్ జోలికి పోవద్దని, డ్రగ్ వినియోగం చెందిన వారికి ఎటువంటి శిక్ష వేస్తారో తెలిపారు. సామాజికవేత్త గుడ్ల హరిప్రసాదరావు మాట్లాడుతూ మంచి అలవాట్లు కలిగి ఉండి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ప్రతి విద్యార్థి ఉండాలన్నారు. మద్యపానం, సిగరెట్లు ఏ విధంగా జీవితాన్ని నాశనం చేస్తాయో అనే విషయాన్ని పాట ద్వారా వినిపించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య, అధ్యాపకులు కల్పన, శ్రీవాణి, తులసి, శాంతి ఉన్నారు.

వరదబాధితులకు విరాళాలు సేకరిస్తున్న ఆశా కార్యకర్తలు

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

కేరళలోని వయినాడ్‌లో సంభవించిన వరదల కారణంగా ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, వారి ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనను జాతీయ విపత్తుగా పరిగణించి ఆ స్థాయిలో రాష్ట్రానికి నిధులు ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తోణాంలో ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, వైద్య సిబ్బందితో కలిసి సిఐటియు నాయకులు సుజాత, మరియమ్మ, రాజేశ్వరి, రమణమ్మ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరదలకు నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. అలాగే సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సేకరిస్తున్న విరాళాలను కేరళ సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు త్రివేణి, రమణమ్మ ,ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కుసిమి పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కుసిమి ఎంపిపి పాఠశాలను డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల మధ్యాహ్నం భోజనం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఆటల పాటలతో బోధించాలన్నారు. బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎంసి ఎన్నికలు సజావుగా జరిపించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని పాఠశాలలో ఈనెల 8న నిర్వహించనున్న పిఎంసి ఎన్నికలు సజావుగా జరిపించాలని ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు ప్రధాన ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం మండలంలోని నీలానగరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులను పిఎంసి ఎన్నికల్లో పాల్గొనేలా చూడాలన్నారు. వీటికి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, పర్యవేక్షించాలన్నారు. ఎక్కడా ఎటువంటి తగాదాలు లేకుండా ప్రశాంతంగా పిఎంసి ఎన్నికలు జరిపించాలని ఆయన కోరారు

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక భవితకేంద్రంలో మంగళవారం వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు. ఎంఇఒ జి.సూర్యదేముడు మాట్లాడుతూ 18ఏళ్లలోపు పిల్లలు ఈ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి-2, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫిజియోథెరప్ట్ డాక్టర్ జి.అజయ్‌కుమార్, ఐఇఆర్‌టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మహాత్మా జ్యోతిరావు పులే పాఠశాల విద్యార్థులకు నేత్ర వైద్య సహాయకులు రమేష్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి పరిశీలించి విద్యార్థులకు కళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వమే కంటి ఆపరేషన్ చేసి కళ్లజోలు, మందులు అందజేస్తుందని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి సన్యాసినాయుడు

పూతిక వలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన పూతికవలసలో మంగళవారం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యులు సేవలు అందించారు. జ్వరాల పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూతికవలసలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. డార్మెంటరీ, కిచెన్ తరగతి గదులను క్షుణంగా పరిశీలించారు. విద్యా బోధన గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సత్యవేణి, కార్యదర్శి శివాజీ, వైద్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఒక పక్క ఉక్కపోత... మరో పక్క వర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గత మూడురోజులుగా వాతావరణం లో ఏర్పడిన మార్పుల కారణంగా స్థానిక ప్రజలకు ఉక్క పోతతో అల్లాడిపోతున్న తరుణంలో పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఒకసారిగా వాతావరణంలో మార్పులు ఏర్పడి వర్షం ఏకధాటిగా కురిసింది. సాయంత్రం వరకూ వర్షం కురవడంతో పట్టణంలో వాతావరణం చల్లబడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

వీరఘట్టం : చాకులు చెప్పి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎంపిడిఒ ఎంవి బాలసుబ్రహ్మణ్యం సచివాలయాల కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్‌డబ్ల్యుపిసి నిర్వహణ, కూరగాయల మొక్కల పెంపకం, ఐహెచ్ఎల్ వంటివి అభివృద్ధి పర్చేందుకు కృషి చేయాలన్నారు. దోమల నివారణకు గ్రామాల్లో ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలోని సీతంపేట, వీరఘట్టం మండలాల్లోనే మలేరియా కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే వారిపై వేటు తప్పదని, బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. గతంలో ఫాగింగ్ యంత్రాలు పంపిణీ చేశామని, అవి సక్రమంగా పనిచేస్తుందీ, లేనిదీ చూడాలని అన్నారు. పనిచేయకపోతే తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒ పి.రాము, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న సిఐటియు నాయకులు

23వ రోజు కొనసాగిన శివ్వాం దళితుల దీక్షలు

సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో శివ్వాం దళితులకు న్యాయం చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు మంగళవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కమిటీ సభ్యులు దీక్షలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు మాట్లాడుతూ శివ్వాంలో దళితులను కులం పేరుతో తిట్టి, కొట్టిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలని, వారి భూములను వెంటనే వాళ్లకు అప్పగించాలని, తొక్కుడువలస, తానవలస, పనసభద్ర, ధోనిగెడ్డవలస, సంధివలస, సీతంపేట, ములగవలస, లచ్చందొరవలస, వెలగవలస తదితర గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు పెట్టే కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.ఉమామహేశ్వరరావు, కె.ఉపేంద్ర, పి.రాజశేఖర్, ఎం.వెంకటరమణ, హెచ్. సింహాచలం, అఖిల్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

ప్రతి వాహనచోదకుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎంవిఐ జి. సత్యనారాయణ సూచించారు. స్థానిక విజయరామరాజు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం రోడ్డు భద్రత నియమాలు, ప్రమాదాలపై అవగాహన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. అంతేకాక వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, విధిగా సీటు బెల్ట పెట్టుకోవడం, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.నారాయణరావు విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీని సందర్శించిన డిఇ

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలో గల జగనన్న కాలనీని హౌసింగ్ సాలూరు సబ్ డివిజన్ డిఇ సోమేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణ జాప్యంపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలని ఎఇ సింహాచలంకు సూచించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు కాలనీలో ఆవాసం ఉంటున్న లబ్ధిదారులంతా డిఇ సోమేశ్వరరావు వద్ద తమ సమస్యలను ఏకరువుపెట్టారు. రోడ్లు సక్రమంగా లేవని, విద్యుత్ సౌకర్యాలు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

సిహెచ్‌డబ్ల్యుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పెండింగ్ జీతాలు చెల్లించి అన్ని విధాలుగా భరోసా కల్పించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ అరుణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసననుద్దేశించి సాంబమూర్తి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల మండల నాయకులు ఆర్.అనసూయమ్మ మాట్లాడుతూ మండలంలోని కూనేరురామభద్రపురం, కొమరాడ, మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 120 మందికి పైగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. వీరికి నెలకు రూ.4000 వేతనం ఇచ్చే పరిస్థితి ఉందని అన్నారు. ఈ వేతనం కూడా గడిచిన నాలుగు నెలలుగా ఇవ్వని పరిస్థితి ఉందని ఇలాంటి సందర్భంలో వీరికి పని భారం చాలా తీవ్రత కూడిన పరిస్థితి ఉందని కావున రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు సంబంధించి పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు . రాజకీయ వేధింపుల ఆపాలని, డిఎ, టిఎలు ఇవ్వాలని, కరోనా సమయంలో చనిపోయిన కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం, ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని కోరారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ చదువుకున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల వారికి ఆశా వర్కర్లుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు విజయమ్మ, మహేశ్వరి, లక్ష్మి, పార్వతి, చినతల్లి, గంగమ్మ, మంగ, జయమ్మ పాల్గొన్నారు.

పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న సిహెచ్‌డబ్ల్యులు

ఆదివాసీల జీవనశైలి పిల్లలకు తెలపాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, వృత్తులు, పంటలు, జీవన విధానం ఆదివాసీ పిల్లలకు తెలియజేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలో బియ్యాలవలస పంచాయతీ దురిబిలిలో ఎస్‌సొసైటీ అధ్యక్షులు షేక్ గౌస్ మంగళవారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ముందుగా ఏర్పాటు చేసిన ఆదివాసీల పంటలు స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఎస్‌సొసైటీ అధ్యక్షులు షేక్ గౌస్ మాట్లాడుతూ ప్రతి గిరిజనుడు సాగు చేస్తున్న కొండపోడు వ్యవసాయానికి ఆర్ఒఎఫ్ఆర్ పట్టా ఇవ్వాలని, ఉపాధి హామీ సక్రమంగా అమలు చేసి ప్రతి గిరిజనుడికి జాబు కార్డు, వేతనాలు సక్రమంగా అందేలా ఉపాధిహామీ అనుసంధానం చేసి, గిరిజన గ్రామాల్లో ఉన్న వంటి పిల్లలందరికీ విద్యను అందించేలా కషి చేయాలని తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలంతా ఐక్యంగా పండగ వాతావరణంల జరుపుకోవాలన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో వాటిని మన పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత మనదేనన్నారు. అలాంటప్పుడే ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు జీవన మనుగుడు అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. ఆదివాసీల కోసం ప్రవేశపెట్టిన తీర్మానాలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆదివాసీ పంటల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోలక లక్షణమూర్తి, స్థానిక సర్పంచ్ పి.అజ్జారి, గిరిజన నాయకులు కద్రక మల్లేష్, నిమ్మక సింహాచలం, మండంగి అడ్డమేశ్వరరావు, పువ్వల పత్తి, వెంపటాపు భారతి, జిపికె స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు, టిడిపి నాయకులు కలిశెట్టి కొండయ్య, కోలా రంజిత్ కుమార్, చందక రామకష్ణ, జనసేన నాయకులు ఎన్.వంశీ, గిరిజన నాయకులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వా ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలని డిఐఒ ఎం.నారాయణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా గర్భిణులకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. ఇమ్యూనైజేషన్ ఆన్లైన్లోనే ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉషారాణి. పి.పావని, వైద్య సిబ్బంది ఎస్వీ రమణ, శర్మ, ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు నిర్వహించాలి

టీకాల నిర్వహణను సకాలంలో చేపట్టాలని జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి ఎ.నారాయణరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధినిరోధక టీకాలను సకాలంలో గర్భిణులకు, చిన్నపిల్లలకు వేయాలని సూచించారు. జిల్లాలో ఎంఆర్ఐ 1,2 కార్యక్రమంలో 89 నుంచి 92 శాతం వరకు అయిందని, మరో వారం రోజుల్లో లక్ష్యం పూర్తవుతుందన్నారు.

జ్వరాల తీవ్రత పై దృష్టి సారించాలి

వీరఘట్టం: గ్రామాల్లో జ్వరాల తీవ్రతను తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా

వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ నారాయణరావు

కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు అధికంగా ఉన్నట్లయితే అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారమందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంత కుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక 132 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఎఇ డి.బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగ దారులు ఈ అంశాన్ని గ్రహించాలని ఆయన కోరారు.

సీతంపేట : మండలంలో బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎఇ జి.నీలమ తెలిపారు. 132 కెవి సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆటలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రైవేటు పాఠశాలల్లో ఆగస్టు15 సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని, అయితే ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులను అందజేయనున్నారు. మండల పరిధిలోని గరుగుబిల్లి, రావివలస, ఉల్లిభద్ర, నాగూరు, రావుపల్లి, కొత్తూరు, తదితర గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు మండల పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - మక్కువ

ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యశాక సిబ్బంది ప్రజలను కోరారు. స్థానిక పిహెచ్‌సి పరిధిలోని వైద్య సిబ్బంది మక్కువలో జగనన్న కాలనీ బీసీ కాలనీల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. మంగళవారం హెల్త్ అసిస్టెంట్ మన్మధరావు నేతృత్వంలో సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టి అవసరమైన వారికి మాత్రలు అందజేశారు. ఇంటిలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచరాదని, అలాగే ఫ్రిడ్జ్ వెనుక భాగంలోనూ, కూలర్లలోను ఉండే నీటి నిల్వలపై జాగ్రత్త వహించాలన్నారు. దోమల నివారణకు అవసరమైన వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఆశ వర్కర్లు పాల్గొన్నారు

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రొంగలి ఆదినారాయణ కుటుంబానికి డాక్టర్ బుద్దేశ్వరరావు, తోటి ఉద్యోగులు లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు. సోమవారం పిహెచ్‌సికి వచ్చిన కుటుంబ సభ్యులకు నగదు అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ పద్మ, హెచ్ఎస్ ఎర్రాయమ్మ, శ్రీను, హెచ్ఎలు రత్న ప్రసాద్, ఎస్‌వి ప్రకాష్, రాజేష్, రాధాకృష్ణ, ఎం.పార్వతి తదితరులు ఉన్నారు.

ఆహార భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ప్రతి వ్యాపారి ఆహార భద్రత నియమాలు పాటించాలని జిల్లా ఆహార భద్రత అధికారి వై.రామయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోనిపలు టీ, టిఫిన్, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఫుట్పాత్‌పై వ్యాపారాలు చేస్తున్న పని తోపుడుబండ్ల యజమానులకు ఆహార భద్రతశాఖకు సంబంధించిన లైసెన్సులు ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అలాంటి వంటకాలు వండి విక్రయాలకు పాల్పడితే ప్రభుత్వపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని బిజె పురం కూడలిలో వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరంగా నిర్వహించారు. వాహన చోదకులు విధిగా తాము ప్రయాణిస్తున్న వాహనాలకు సంబంధించి లైసెన్స్, ఇన్సూరెన్స్, కాగితాలతో పాటు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని వారు సూచించారు. వాహన చోదకులు మద్యం తాగి వాహనాలు నడపడం, లైసెన్సు లేకుండా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, అధికలోడ్లతో వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎరువులను ఎవరైనా డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలను తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అనురాధ పండా హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల షాపుల్లోనూ, గోడౌన్ల వద్ద వున్న సరుకుల రికార్డులను సరి చూశారు. ఇందులో ఎటువంటి తేడా వచ్చినా, అధిక ధరలకు విక్రయించినట్లు సమాచారం వస్తే ఎరువుల షాపుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో వివిధ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. శివరాంపురం పిఎసిఎస్ కు కొద్ది మొత్తంలోని ఎరువులు వచ్చాయని, అవి అక్కడున్న రైతులకు సరిపోలేదని, ఇంకా కావాల్సిన రైతులకు ఎరువులు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.